## క్లుప్తంగా

### పేదలకు వరంగా సీఎంఆర్‌ఎఫ్

ఎమ్మెల్యే సునీతారెడ్డి



సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే సునీతారెడ్డి

హత్నూర (సంగారెడ్డి): పేదలు అనారోగ్యానికి గురై ఆస్పత్రిలో వైద్యం చేయించుకునేందుకు ముఖ్యమంత్రి సహాయనిధి ఓ వరంలా ఆదుకుంటుందని ఎమ్మెల్యే సునీతారెడ్డి పేర్కొన్నారు. ఆత్మనూరు మండలం తెల్లరాళ్ల తండాకు చెందిన మోతీలాల్‌కు రూ.55,500, రామచందర్‌కు రూ.60 వేల విలువైన చెక్కులను శుక్రవారం ఎమ్మెల్యే బాధిత కుటుంబీకులకు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ...పేద ప్రజలకు ప్రభుత్వం మంజూరు చేస్తున్న సీఎంరిలీఫ్ ఫండ్ ఎంతగానో ఆర్థికంగా దోహదపడుతుందన్నారు. ఈ పంపిణీలో నాయకులు నామ్యనాయక్ తదితరులు పాల్గొన్నారు.

### సంగమేశ్వరాలయంలో హుండీ లెక్కింపు



సంగారెడ్డి లోని కేతకి సంగమేశ్వర ఆలయ హుండీని లెక్కిస్తున్న భక్తులు.

సంగారెడ్డి టౌన్ :సంగారెడ్డి పట్టణంలోని పోతిరెడ్డిపల్లి సంగమేశ్వరాలయంలో ఆలయ అర్చకులు నాగరాజ్ శర్మ, శివకుమార్ ఆధ్వర్యంలో శుక్రవారం ఆలయ హుండీని లెక్కించారు. హుండీలో భక్తులు వేసిన విరాళాలు రూ.2,62,699గా లెక్క తేలింది. ఈ మేరకు ఆలయ కార్యనిర్వాహణాధికారి ఉప్పల శశిధర్ మీడియాకు వెల్లడించారు.

### బీసీలకు 42% రిజర్వేషన్ల అమలుపై హర్షం



అంబేడ్కర్ విగ్రహం వద్ద సంబరాల్లో కాంగ్రెస్ శ్రేణులు

సంగారెడ్డి : కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన మాట ప్రకారం బీసీలకు 42% రిజర్వేషన్లు అమలుకు తెలంగాణ కేబినెట్ ఆమోదం తెలిపిన సందర్భంగా సంగారెడ్డిలో శుక్రవారం సంబరాలు చేశారు. కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో అంబేడ్కర్ విగ్రహం వద్ద బాణసంచా కాల్చి, మిఠాయిలు పంచుకున్నారు. కార్యక్రమంలో టీపీసీసీ రాష్ట్ర కార్యదర్శి తోపాజి అనంత కిషన్, నాయకులు కూన వేణు, కిరణ్ గౌడ్, చేర్యాల ఆంజనేయులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

### పోచమ్మ అమ్మవారికి బోనాలు

మునిపల్లి(అందోల్): పోచమ్మ అమ్మవారికి భక్తులు భక్తిశ్రద్ధలతో బోనాలు సమర్పించారు. ఆషాఢ మాసం సందర్భంగా మండలంలో పెద్దలోడి గ్రామంలో భక్తులు అమ్మవారికి శుక్రవారం బోనాలు తీశారు. డప్పుచప్పుళ్లు, పోతురాజుల విన్యాసాలతో గ్రామంలో ఊరేగింపుగా అమ్మవారికి బోనాలు తీశారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు, భక్తులు పాల్గొన్నారు.

### 90వేల మొక్కలు నాటడమే లక్ష్యం

రాయికోడ్(అందోల్): వనమహోత్సవంలో భాగంగా ప్రతీ ఒక్కరు మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని ఏపీఓ రమేశ్‌కుమార్ కోరారు. మండలంలోని నల్లంపల్లి గ్రామంలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని శుక్రవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మండలంలోని ఆయా గ్రామాల్లో ఈ యేడాది 90 వేల మొక్కలను నాటేందుకు లక్ష్యంగా నిర్ణయించామన్నారు. ఇప్పటివరకు 11,500 మొక్కలు నాటేందుకు గుంతలు సిద్ధం చేశామని చెప్పారు.

### పేద విద్యార్థులను ప్రోత్సహించాలి

రామచంద్రాపురం(పటాన్‌చెరు): ప్రభుత్వ పాఠశాల, కళాశాలలో చదివే విద్యార్థులను ప్రోత్సహించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని శాసనమండలి మాజీ ప్రొటెం చైర్మన్ వెన్నవరం భూపాల్‌రెడ్డి అన్నారు. శుక్రవారం పట్టణంలోని గీత భూపాల్ ప్రభుత్వ జూనియర్ కళాశాలను సందర్శించారు. ఈసందర్భంగా ఇంటర్మీడియెట్‌లో ఉత్తమ మార్కులు సాధించిన ప్రతి గ్రూపు నుంచి ముగ్గురు విద్యార్థులకు రూ. 48 వేల చెక్కును ప్రిన్సిపాల్ వెంకట్‌రెడ్డికి అందజేశారు. కార్యక్రమంలో నియోజకవర్గ కోఆర్డినేటర్ ఆదర్శ్‌రెడ్డి, మాజీ కార్పొరేటర్ అంజయ్య, సీనియర్ నాయకులు కుమార్ గౌడ్, విష్ణువర్ధన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



చందాపూర్ గేటు వద్ద అసంపూర్తిగా ఉన్న బస్‌షెల్టర్



హత్నూర శివారులో కొన్యాల గేటు వద్ద అసంపూర్తిగా ఉన్న బస్ షెల్టర్

## అసంపూర్తిగా బస్ షెల్టర్లు

- పట్టించుకోని అధికారులు, ప్రజాప్రతినిధులు
- ఇబ్బంది పడుతున్న ప్రయాణికులు

హత్నూర(సంగారెడ్డి): ప్రయాణికుల సౌకర్యార్థం నిర్మించిన బస్‌షెల్టర్లు దశాబ్దాలు గడుస్తున్నా అసంపూర్తిగానే ఉన్నాయి. పూర్తి చేయాలన్న ఆలోచన అధికారులకు, ప్రజాప్రతినిధులకు రాకపోవడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. మండల కేంద్రమైన హత్నూర శివారులో కొన్యాల బస్టాప్ వద్ద, చందాపూర్, మల్కాపూర్, షేర్‌ఖాన్‌పల్లి, నాగారం గ్రామాల్లోని స్టేజీల వద్ద నిర్మించిన బస్‌షెల్టర్లు అసంపూర్తిగానే మిగిలిపోయాయి. గతంలో మంజూరైన నిధులు పూర్తిగా రద్దు కావడంతో ప్రస్తుతం నిధులు లేక వెలవెలబోతున్నాయి. పూర్తిస్థాయి నిర్మాణం కోసం ప్రభుత్వం నూతనంగా నిధులు మంజూరు చేయాలని పలువురు అభిప్రాయపడుతున్నారు. అసంపూర్తిగా ఉన్న బస్‌షెల్టర్లను పూర్తి స్థాయిలో నిర్మించేందుకు ప్రత్యేక నిధులు కేటాయించాలని పలు గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

## మౌలిక వసతులపై ప్రత్యేక శ్రద్ధ

కలెక్టర్ ప్రావీణ్య



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టరు ప్రావీణ్య

సంగారెడ్డి జోన్: జిల్లాలోని సంక్షేమ వసతి గృహాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నట్లు కలెక్టర్ ప్రావీణ్య పేర్కొన్నారు. కలెక్టరేట్‌లో విద్యా, వైద్య శాఖల అధికారులతోపాటు వివిధ విభాగాల సంక్షేమాధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వసతి గృహాల్లో విద్యార్థుల సౌకర్యార్థం తాగునీటి సరఫరా, విద్యుత్, పరిసరాల పరిశుభ్రత, మరుగుదొడ్లు, ఆరోగ్యకరమైన వాతావరణం వంటి అంశాలపై దృష్టి వహించాలన్నారు. ప్రతీరోజు మెనూ ప్రకారం నాణ్యమైన ఆహారం అందించాలని స్పష్టం చేశారు. ఆహార నాణ్యతను ఎప్పటికప్పుడు తనిఖీ చేసి మెనూను పాటించకపోతే చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.

**ప్రభుత్వాస్పత్రుల అభివృద్ధికి కృషి**

జిల్లాలోని ప్రభుత్వ ఆసుపత్రులలో మెరుగైన సౌకర్యాల కోసం సీఎస్ఆర్ నిధులు కేటాయించి, అభివృద్ధికి కృషి చేయాలని కలెక్టర్ పేర్కొన్నారు. జిల్లాలో చేపట్టే అభివృద్ధి పనుల కోసం అభివృద్ధి కమిటీ ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ఈ కమిటీ ప్రతీ 15 రోజులకు ఒకసారి జిల్లాలో జరుగుతున్న అభివృద్ధి పనుల పురోగతిని సమీక్షించాలన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్ చంద్రశేఖర్, సాంఘిక సంక్షేమాధికారి అఖిలేష్ రెడ్డి, బీసీ సంక్షేమాధికారి జగదీశ్, మైనార్టీ సంక్షేమ శాఖ అధికారి దేవుజా, సీపీఓ బాలశౌరి, జిల్లా వైద్యాధికారి గాయత్రీదేవి, డి.ఈ.ఓ వెంకటేశ్వర్లు, పరిశ్రమల శాఖాధికారులు తదితరులు పాల్గొన్నారు.

### రైతులకు న్యాయం చేయాలి



తహసీల్దార్ అశోక్‌కు వినతిపత్రం అందజేస్తున్న బీజేపీ నాయకులు

కొండాపూర్(సంగారెడ్డి): భూములు కోల్పోయిన రైతులకు ఇళ్ల స్థలాలు ఇచ్చి న్యాయం చేయాలని బీజేపీ మండల ప్రధాన కార్యదర్శి శివ డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం మండల కేంద్రమైన కొండాపూర్‌లో తహసీల్దార్ అశోక్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా శివ మాట్లాడుతూ...గతంలో ప్రభుత్వం పేదలకు ఇళ్ల స్థలాల పేరు చెప్పి తొగర్‌పల్లి రైతుల దగ్గర భూమిని లాక్కొన్నారన్నారు. అందుకుగాను భూమిని కోల్పోయిన రైతులకు పరిహారంతోపాటు ఇళ్ల స్థలాలు కూడా ఇస్తామని అధికారులు హామీ ఇచ్చినట్లు వారు తెలిపారు. దాదాపు కొన్నేళ్ల నుంచి రైతులు ఇళ్ల స్థలాల గురించి వేచి చూస్తున్నారని, ఇప్పటివరకు ప్రభుత్వం రైతులకు ఇళ్ల స్థలాలకు సంబంధించి పొజిషన్ చూయించలేదన్నారు. కానీ, కొన్ని రోజుల క్రితం వచ్చిన కార్పొరేట్ సంస్థకు మాత్రం ప్రభుత్వం వెంటనే భూమిని మంజూరు చేసిందన్నారు. కార్పొరేట్ సంస్థల మీద ఉన్న శ్రద్ధ ప్రభుత్వానికి పేద రైతుల పైన లేకుండా పోయిందన్నారు. ప్రభుత్వం స్పందించి త్వరలోనే పేద రైతులందరికీ ఇళ్ల స్థలాలు ఇచ్చి న్యాయం చేయాలని లేనిపక్షంలో పెద్ద ఎత్తున ధర్నా నిర్వహిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో మండల బీజేపీ నాయకులు ఆంజనేయులు, ప్రశాంత్, కిషన్, కృష్ణ, భాను, మల్లేశం, మహేష్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## నిమ్జ్‌లో రెండో రోజూ ఏసీబీ తనిఖీలు



ఏసీబీ తనిఖీల కారణంగా నిమ్జ్, ఆర్డీఓ కార్యాలయాల్లో కనిపించని ప్రజల సందడి

జహీరాబాద్: పట్టణంలోని జాతీయ పెట్టుబడుల ఉత్పాదక మండలి(నిమ్జ్) ప్రాజెక్టు కార్యాలయంలో రెండో రోజు శుక్రవారం సైతం ఏసీబీ తనిఖీలు కొనసాగాయి. గురువారం ఏసీబీ దాడులు నిర్వహించి ప్రాజెక్టు డిప్యూటీ కలెక్టర్ రాజు, డిప్యూటీ తహసీల్దార్ సతీష్, డ్రైవర్ దుర్గయ్యలను పట్టుకున్న విషయం తెలిసిందే. ఈ సందర్భంగా డిప్యూటీ తహసీల్దార్ వద్ద రూ.15వేలు, డిప్యూటీ కలెక్టర్‌కు ఇవ్వాలనుకున్న రూ.50వేలు ఏసీబీ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. అందులో భాగంగానే రెండో రోజు సైతం తనిఖీలు కొనసాగించారు. ఈ సందర్భంగా పలు రికార్డులు స్వాధీనం చేసుకున్నట్లు సమాచారం. ఇందుకు సంబంధించిన వ్యవహారంపై విచారణ చేపట్టేందుకు వీలుగా అవసరమైన రికార్డులు తీసుకెళ్లినట్లు తెలిసింది. తనిఖీల సందర్భంగా రైతులకు ఇవ్వాల్సిన చెక్కులు లభ్యమైనట్లు తెలిసింది. వాటిని సీజ్‌చేసినట్లు సమాచారం. నిర్వాసితలకు ఇవ్వాల్సిన చెక్కులను కావాలనే తొక్కిపెట్టి ఉండవచ్చనే అభిప్రాయం వ్యక్తం అవుతోంది. ఆర్డీఓ కార్యాలయం, నిమ్జ్ కార్యాలయం ఒకే భవనంలో ఉండడంతో సోదాలు కొనసాగేంత వరకు రెండు కార్యాలయాల సిబ్బంది అక్కడే ఉండిపోక తప్పలేదు. ప్రజలు కూడ ఆయా కార్యాలయాల వైపు రాకుండా గేటు మూసి ఉంచారు.

### నేడు కాంగ్రెస్ కార్యకర్తల సమావేశం

నారాయణఖేడ్: ఖేడ్ నియోజకవర్గ స్థాయి కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల సమావేశం శనివారం ఉదయం 10 గంటలకు నిర్వహించనున్నట్లు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం తెలిపింది. ఎంపీ సురేష్ షెట్కార్, ఎమ్మెల్యే సంజీవరెడ్డి పాల్గొనే సమావేశానికి నియోజకవర్గంలోని కాంగ్రెస్ పార్టీతో పాటు అనుబంధ సంఘాల బాధ్యులు, మాజీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు హాజరు కావాలని కోరారు.

### శాకంబరిగా అమ్మవారు



జహీరాబాద్: పట్టణంలోని గడి మహాలాలో గల ఊరడమ్మ దేవాలయానికి భక్తులు బోనాల తీశారు. ఉత్సవాలలో భాగంగా మొదటి రోజు శుక్రవారం అమ్మవారు శాకంబరి అవతారంలో దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు పి.శ్రీకాంత్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు సిద్దన్న, కమిటీ సభ్యులు, మహా రాణాప్రతాప్ యూత్ సభ్యులు, భక్తులు పాల్గొని నైవేద్యాలు సమర్పించి దర్శించుకున్నారు.

### అర్హులందరికీ రేషన్ కార్డులు

మునిపల్లి(అందోల్): రాజకీయ పార్టీలకతీతంగా రేషన్‌కార్డులు మంజూరు చేయాలని బీఆర్ఎస్ సోషల్ జస్టిస్ నాయకులు సుల్తాన్ శుక్రవారం తహసీల్దార్ గంగాభవానికి వినతిపత్రం అందజేశారు. కార్డులకోసం లబ్ధిదారులు ఇబ్బందులు పడకుండా చూడాలని కోరారు.

### రోడ్ల అభివృద్ధికి నిధులు కేటాయించండి



వినతిపత్రం ఇస్తున్న కార్పొరేటర్ పుష్ప

రామచంద్రాపురం(పటాన్‌చెరు): రామచంద్రాపురం డివిజన్ పరిధిలోని కాలనీల్లో సీసీ రోడ్ల అభివృద్ధికి ప్రత్యేక నిధులు మంజూరు చేయాలని కోరుతూ జీహెచ్‌ఎంసీ ప్రధాన కార్యాలయంలో నగర మేయర్ గద్వాల్ విజయలక్ష్మి, జీహెచ్‌ఎంసీ కమిషనర్ ఆర్‌వి. కర్ణన్‌కు శుక్రవారం కార్పొరేటర్ పుష్ప వినతిపత్రం అందజేశారు.

## సంక్షిప్త వార్తలు

**◆ పిల్లలను అంగన్‌వాడీ కేంద్రాల్లో చేర్చాలి**

మునిపల్లి(అందోల్): ప్రాథమిక విద్య కోసం పిల్లలను అంగన్‌వాడీ కేంద్రంలో చేర్చాలని కేంద్రం సూపర్‌వైజర్ నాగమణి తల్లిదండ్రులను కోరారు. మండలంలోని పెద్దలోడి (లోనికలాన్) రైతువేదికలో శుక్రవారం బాలమేళా నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ మూడేళ్లు పూర్తయిన పిల్లలను అంగన్‌వాడీ కేంద్రంలో చేర్పించాలని కోరారు. ఈ సందర్భంగా పిల్లలు చేసిన నృత్యాలు అందరినీ ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో కేంద్రం వర్కర్లు మంజుల, స్వప్న, పిల్లల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

**◆ విద్యార్థులకు సన్మానం**



రామచంద్రాపురం(పటాన్‌చెరు): నియోజకవర్గంలోని ప్రభుత్వ పాఠశాలలో ఉత్తమ మార్కులు సాధించిన పదో తరగతి విద్యార్థులను క్లాస్‌మేట్ క్లబ్ ఆధ్వర్యంలో రామచంద్రాపురం జిల్లా పరిషత్ పాఠశాలలో ఘనంగా సన్మానించారు. ఈసందర్భంగా క్లబ్ అధ్యక్షుడు జయప్రకాష్ మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలలో చదవిన తాము ఒక క్లబ్‌ని ఏర్పాటు చేసుకొని, ప్రభుత్వ పాఠశాలలో పదో తరగతిలో మంచి మార్కులు సాధించిన విద్యార్థులను ఏటా వారిని సన్మానిస్తామని వివరించారు. కార్యక్రమంలో ఎంఈఓ పీపీ రాథోడ్, క్లబ్ సభ్యులు మణికంఠ, రణధీర్‌రెడ్డి, శ్రీధర్, శ్వేత, కృష్ణ, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

**◆ ఎంపీ కోటా నిధులతో బోరు తవ్వకం**

నారాయణఖేడ్: మండలంలోని కొండాపూర్ పంచాయతీ పరిధిలోని స్కూల్ తండాలో భగీరథ ద్వారా తాగునీటి సరఫరా సరిగా కాకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారు. దీంతో కొండాపూర్ మాజీ ఎంపీటీసీలు సుజాత రాజునాయక్, రాథోడ్ రాంచందర్ విషయాన్ని జహీరాబాద్ ఎంపీ సురేష్ షెట్కార్ దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన ఆయన బోరు తవ్వకం, మోటారు ఏర్పాటుకు తన కోటా కింద రూ.2 లక్షలు మంజూరు చేశారు. బోరును తవ్వించగా పుష్కలంగా నీళ్లుపడ్డాయి. శుక్రవారం మోటారును బిగించారు. దీంతో తండావాసులు సంతోషం వ్యక్తం చేశారు.

**◆ అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకోండి**

జిన్నారం(పటాన్‌చెరు): గడ్డపోతారం మున్సిపాలిటీ పరిధిలోని అలీనగర్ సర్వే నంబర్ 27 తెలంగాణ కాలనీలోని ప్రభుత్వ భూమిలో చేపడుతున్న అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకోవాలని నాయకులు బాలయ్య ఆధ్వర్యంలో శుక్రవారం తహసీల్దార్ దేవదాసుకు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ విషయంపై క్షేత్రస్థాయిలో విచారణ జరిపి తగు చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

**◆ పరిసరాలు పరిశుభ్రంగా ఉండాలి**

న్యాల్‌కల్(జహీరాబాద్): పాఠశాల పరిసరాలు పరిశుభ్రంగా ఉండేలా చూడాలని ఎంఈఓ మారుతి రాథోడ్ ఉపాధ్యాయులకు సూచించారు. మండల పరిధిలోని మిర్జాపూర్(ఎన్), టేకూర్, తాట్‌పల్లిలోని ప్రభుత్వ పాఠశాలను శుక్రవారం ఆయన తనిఖీ చేశారు. రికార్డులు, మధ్యాహ్నం భోజనం నిర్వహణను పరిశీలించి వివరాలను విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం వర్షాలు కురుస్తున్నందున వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని, పాఠశాలల ఆవరణలో ఎక్కడ కూడా చెత్తా, చెదారం లేకుండా ఉంచాలని సూచించారు.

**◆ అక్రమ పార్కింగ్‌తో ఇక్కట్లు**

జిన్నారం(పటాన్‌చెరు): గుమ్మడిదల మున్సిపాలిటీ బొంతపల్లి పారిశ్రామికవాడలోని గ్రాన్యూవిల్స్ పరిశ్రమ అక్రమ పార్కింగ్ సమస్యతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పరిశ్రమకు వచ్చే భారీ ట్యాంకర్లు, వాహనాలు రోడ్డుకు ఇరువైపులా నిలపడంతో ద్విచక్రవాహదారులు ప్రమాదాల బారిన పడుతున్నారని పలువురు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ రోడ్డుగుండా నిత్యం వందల సంఖ్యలో కార్మికులు ప్రయాణిస్తుంటారు. రాత్రి సమయాల్లో అక్రమ పార్కింగ్ సమస్య మరింత ప్రమాదకరంగా మరుతుందని, మున్సిపల్ అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

**◆ ఏరియా ఆసుపత్రికి కాయకల్ప ప్రశంస**

జోగిపేట(అందోల్): జోగిపేట ఏరియా ఆస్పత్రి నిర్వహణలో కాయకల్ప ప్రశంసపత్రాన్ని సాధించింది. ఇటీవల కాయకల్ప బృందం నిర్వహించిన తుది అసెస్‌మెంట్‌లో మంచి ఫలితాలను గుర్తించడంతో ఈ ప్రశంస లభించించింది. ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ సౌజన్య శుక్రవారం మాట్లాడుతూ కాయకల్ప ప్రశంస లభించడం చాలా ఆనందంగా ఉందన్నారు.

## దోమలు వృద్ధి చెందకుండా చర్యలు

ఖేడ్ మున్సిపల్ కమిషనర్ జగ్జీవన్



కుండీల్లో నిల్వ ఉన్న నీటిని పారబోస్తున్న సిబ్బంది

నారాయణఖేడ్: దోమలు వృద్ధి చెందకుండా చర్యలు తీసుకుంటున్నామని ఖేడ్ మున్సిపల్ కమిషనర్ జగ్జీవన్ పేర్కొన్నారు. శుక్రవారం 100 రోజుల ప్రణాళికలో భాగంగా మున్సిపాలిటీ పరిధిలోని బైపాస్‌రోడ్డు పక్కన ప్రమాదకరంగా ఉన్న బండరాళ్లను జేసీబీతో తొలగింపజేశారు. పలు కాలనీల్లో తడి, పొడి చెత్తపై అవగాహన కల్పించారు. ఖాళీ స్థలాల్లో నిలిచిన నీటిలో దోమలు వృద్ధి చెందకుండా ఆయిల్‌బాల్స్ వేశారు. పలుకాలనీల్లో పారిశుధ్య పనులు చేపట్టారు. ఇంటి మిద్దెలపై ఉన్న పూలకుండీలు, కూలర్లలో నిల్వ ఉన్న నీటిలో దోమలు వ్యాప్తి చెందే అవకాశం ఉన్నందున అవగాహన కల్పించి పారబోశారు. మెనేజర్ వెంకటేశ్వయ్య, శానిటరీ అధికారి శ్రీనివాస్, వార్డు అధికారులు పాల్గొన్నారు.

## కల్తీ కల్లు బాధితులకు పరామర్శ



కల్తీకల్లు బాధితులను పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి

నారాయణఖేడ్: మండలంలోని సంజీవన్‌రావుపేట్‌కు చెందిన యాదమ్మ, నిజాంపేట మండలం ర్యాలమడుగుకు చెందిన రాములు, కల్హేర్ మండలం రాపర్తికి చెందిన పోచవ్వ హైదరాబాదులో కూలీపనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. కల్తీకల్లు తాగడంతో అస్వస్థతకు గురై నిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. కాగా శుక్రవారం మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి ఆస్పత్రికి వెళ్లి పరామర్శించారు. వారి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకుని మెరుగైన వైద్యం అందించాలని వైద్యులను కోరారు. ప్రభుత్వం కళ్లు తెరిచి కల్తీ కల్లు, మాదకద్రవ్యాలను నివారించి ప్రజల ఆరోగ్యాలను కాపాడాలని డిమాండ్ చేశారు. ఆయన వెంట బీఆర్ఎస్ నాయకులు కృష్ణమూర్తి, ఆంజనేయులు, సతీష్, పురుషోత్తం, అనీల్, మహేందర్ ఉన్నారు.

## వారికి ఓపెన్ స్కూల్ సదవకాశం

డీఈఓ వెంకటేశ్వర్లు



ఓపెన్ స్కూల్ అడ్మిషన్ల కరపత్రాన్ని విడుదల చేస్తున్న డీఈఓ తదితరులు

సంగారెడ్డి ఎడ్యుకేషన్: చదువు మధ్యలో మానేసిన వారికి ఓపెన్ స్కూల్ విధానం ఓ వరం లాంటిదని జిల్లా విద్యాధికారి వెంకటేశ్వర్లు తెలిపారు. సంగారెడ్డిలోని డీఈఓ కార్యాలయంలో శుక్రవారం ఓపెన్ స్కూల్ అడ్మిషన్లకు సంబంధించిన పోస్టర్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా డీఈఓ మాట్లాడుతూ...ఓపెన్ స్కూల్ విధానం ద్వారా మధ్యలో ఆగిపోయిన చదువును మళ్లీ కొనసాగించే అవకాశం ఉందన్నారు. ఓపెన్ స్కూల్ సర్టిఫికెట్లు రెగ్యులర్ సర్టిఫికెట్లతోనే సమానమని, ఉద్యోగాలకు, ఉన్నత చదువులకు, ఇతర ఉపాధి అవకాశాలకు ఈ సర్టిఫికెట్లు ఎంతగానో ఉపయోగపడతాయని తెలిపారు. ఆగష్టు 12వ తేదీ వరకు అడ్మిషన్లకు గడువు ఉందని, డ్రాపౌట్ అయిన వారితోపాటు మహిళలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఓపెన్ స్కూల్‌కు సంబంధించి ప్రతీ మండల కేంద్రంలో అధ్యయన కేంద్రాలున్నాయన్నారు. కార్యక్రమంలో ఓపెన్ స్కూల్ సమన్వయకర్త వెంకటస్వామి, సీఎంఓ వెంకటేశం, ప్రధానోపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

## సత్వర న్యాయం అందించాలి

మహిళా భద్రతా విభాగం ఎస్పీ చేతన



భరోసా కేంద్రంలో సిబ్బందితో మాట్లాడుతున్న ఎస్పీ చేతన

సంగారెడ్డి జోన్: పోలీసు, మహిళా శిశు సంక్షేమ శాఖల సమన్వయంతో బాధిత మహిళలకు సత్వర న్యాయం అందించాలని మహిళా భద్రతా విభాగం ఎస్పీ చేతన స్పష్టం చేశారు. పట్టణంలోని భరోసా కేంద్రాన్ని ఆమె శుక్రవారం సందర్శించి పలురికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ...ప్రతీ రికార్డును ఆన్ లైన్ చేయాలన్నారు. భరోసా కేంద్రానికి వచ్చిన మహిళలకు అన్ని రకాల సేవలు అందేవిధంగా చూడాలని సూచించారు. పోక్సో అత్యాచార కేసులలో బాధితులలో ధైర్యాన్ని నింపి, వారి సమస్య పరిష్కారం అయ్యే విధంగా చూడాలన్నారు. కార్యక్రమంలో భరోసా నోడల్ అధికారి అదనపు ఎస్పీ సంజీవరావు, ఇన్‌స్పెక్టర్ రామానాయుడు, కో ఆర్డినేటర్ దేవలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## కన్‌సాన్‌పల్లి రోడ్డుకు మోక్షం

రూ.కోటితో పనులు ప్రారంభం



పనులను ప్రారంభిస్తున్న నాయకులు

వట్‌పల్లి(అందోల్): గుంతలమయంగా మారిన కన్‌సాన్‌పల్లి బీటీ రోడ్డుకు ఎట్టకేలకు మోక్షం కలిగింది. రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ చొరవతో నిధులు మంజూరయ్యాయి. అందోల్ మండల పరిధిలోని కన్‌సాన్‌పల్లి నుంచి 161 హైవే రోడ్డు వరకు రూ.కోటితో రెండు కిలోమీటర్ల మేర బీటీ రోడ్డు నిర్మాణానికి శుక్రవారం యువజన కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ప్రవీణ్ కుమార్, ఏయంసీ మాజీ డైరెక్టర్ వెంకట్‌రెడ్డి అధికారులతో కలిసి శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ రోడ్డు పదేళ్లుగా కనీస మరమ్మతులకు కూడా నోచుకోలేకదన్నారు. కార్యక్రమంలో డీఈఈ రవీందర్, ఏఈ శశాంక్, సీనియర్ నాయకులు కృష్ణ, మహిపాల్, పార్టీ గ్రామ అధ్యక్షుడు వీరేశం, జాను, నాగార్జునరెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, రుక్మారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## నూతన కాలనీల అభివృద్ధికి నిధుల కేటాయింపు



అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి, కార్పొరేటర్ మెట్టుకుమార్

- ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి
- రూ.2.51కోట్ల అభివృద్ధి పనులకు శంకుస్థాపన

పటాన్‌చెరు: అన్ని రంగాల్లో పటాన్‌చెరు డివిజన్‌ను అభివృద్ధి పథంలో తీసుకుని వెళుతూ ఆదర్శ డివిజన్‌గా తీర్చిదిద్దుతున్నామని ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి పేర్కొన్నారు. పటాన్‌చెరు డివిజన్ పరిధిలోని శాంతి నగర్, ఆల్విన్, వెంకటేశ్వర, నందన్ రతన్ ప్రైడ్ కాలనీల్లో సీసీ రోడ్లు, యాదవ సంఘం, నాయీ బ్రాహ్మణ సంఘం, ముదిరాజ్ సంఘం శ్మశాన వాటికలలో రూ.2.51కోట్ల వ్యయంతో చేపట్టనున్న వివిధ అభివృద్ధి పనులకు శుక్రవారం ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి, కార్పొరేటర్ మెట్టు కుమార్‌తో కలసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...శరవేగంగా అభివృద్ధి చెందుతున్న పటాన్‌చెరు డివిజన్ పరిధిలో నూతనంగా ఏర్పాటవుతున్న కాలనీలతో పాటు పట్టణంలో మౌలిక వసతులతో పాటు సీసీ రోడ్లు, యుజిడీలు నిర్మిస్తున్నామన్నారు. కాలనీల మధ్య అంతర్గత రహదారుల నిర్మిస్తూ ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యం అందిస్తున్నామని తెలిపారు. రాజకీయాలకతీతంగా అర్హులైన ప్రతీ ఒక్కరికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందిస్తున్నామని వివరించారు. కార్యక్రమంలో కార్పొరేటర్ మెట్టుకుమార్ యాదవ్, వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ విజయ్ కుమార్, న్యాయవాది నాగరాజు యాదవ్, పట్టణ పుర ప్రముఖులు, సీనియర్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.